క్లుప్తంగా

వాలీబాల్ క్రీడాకారుడు చరణ్‌కు సత్కారం



చరణ్‌ను సత్కరిస్తున్న పెద్దలు

కూర్మన్నపాలెం: వాలీబాల్ భారత్ జట్టుకు ఎంపికైన అట్టాడ చరణ్‌ను ఆదివారం 87వ వార్డు కణితి రామాలయం వద్ద పలువురు పెద్దలు సత్కరించి ఘనంగా అభినందించారు. వక్తలు మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభచూపి చరణ్ కణితి కాలనీకి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చాడన్నారు. ప్రపంచ పోటీల్లో కూడా ఇదే ప్రతిభ కనబరిచి భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పెద్దలు ప్రగడశ్రీనివాసరావు, శంకరరావు, సన్యాసిరావు, బొడ్డగోవింద్, దానప్పలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న సీఐ పార్థసారథి

పెదగంట్యాడ: ఝాన్సీ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేయడం అభినందనీయమని గాజువాక సీఐ పార్థసారథి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డులోని కాకతీయ ఆర్చి వద్ద ఆదివారం ఝాన్సీ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు తమ సంస్థ ద్వారా ప్రతి సంవత్సరం పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డి రమణ తదితరు నాయకులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్‌పై దాడి

ఉక్కునగరం: పాతకక్షల నేపథ్యంలో రౌడీ షీటర్ మొల్లి సంతోష్ కుమార్‌పై ఐదుగురు వ్యక్తుల దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. దేశపాత్రునిపాలెం సమీపంలోని స్నేహపురి కాలనీలో నివాసముంటున్న సంతోష్‌కుమార్ తన కుమార్తెను స్కూల్ నుంచి తీసుకువచ్చేందుకు వెళ్లాడు. ఆలస్యం అవుతుందని చెప్పడంతో స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద అతని సోదరుడితో మాట్లాడుతున్నాడు. ఇదే సమయంలో పెదగంట్యాడకు చెందిన మొల్లి శివ, మొల్లి శ్రీను, వాసు (బాక్సర్), రవి (బాక్సర్), ప్రవీణ్‌లు కొంత మందితో అక్కడ వచ్చి సంతోష్‌కుమార్‌పై దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. అక్కడ నుంచి తప్పించుకుని సంతోష్‌కుమార్ అగనంపూడి ఆస్పత్రికి వెళ్లాడు. అనంతరం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు పరారీలో ఉన్నారని వారిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు ఆయన తెలిపారు.

జానపద కళలు వారసత్వ సంపద



రామకృష్ణానంద, దుర్గాప్రసాద్‌లను సత్కరిస్తున్న వెంకన్న చౌదరి

సీతంపేట: ఆధ్యాత్మిక ప్రవచన కర్త రామకృష్ణానందకు 'ప్రవచన వాచస్పతి', గేయ రచయిత ఐనాడ దుర్గాప్రసాద్‌కు 'జన కవి' బిరుదులు ప్రదానోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. శ్రీమాతా కళాపీఠం ఆధ్వర్యంలో, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథి వ్యాపారవేత్త యార్లగడ్డ వెంకన్న చౌదరి చేతుల మీదుగా బిరుదులు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులను గుర్తించి వారి కళలకు ప్రాచుర్యం అందించిన ఘనత శ్రీమాతా కళాపీఠానికే దక్కిందన్నారు. కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ జానపద కళలు మన వారసత్వమని, వాటిని కాపాడుకోవడం మన కర్తవ్యమని, అందులో భాగంగా ఈ సన్మాన కార్యక్రమం చేస్తున్న శ్రీమాతా కళాపీఠం అధినేతలను కొనియాడారు. రామకృష్ణానంద ప్రవచన కర్తగా తన వాగ్ధాటితో ప్రజలలో ధర్మ, నిర్మలత్వం, నైతికతను పెంపొందిస్తున్నారన్నారు.

ఆహ్లాదానికి చోటేది?



పెదమడకలోని పార్కులో వసతులు లేక పోయినా ఆడుకుంటున్న పిల్లలు

- కళావిహీనంగా ఉద్యానవనాలు
- ఆకతాయిలకు అడ్డాగా పార్కులు
- మూడు సెక్టార్లలో పార్కుల స్థలాలు ఉన్నా అభివృద్ధి సున్నా

జీవీఎంసీలో విలీనమై రెండు దశాబ్దాలు దాటినా నిర్వాసితకాలనీల్లోని పార్కులు ప్రగతిబాట పట్టలేదు. పిచ్చిమొక్కలతో కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపుతో పాటు సామాజిక అవసరాల కోసం స్థలాలు విడిచిపెట్టారు. జాతీయ రహదారిని అనుకొని గ్రీన్‌పార్క్ కోసం విడిచిపెట్టిన స్థలాలు అక్రమార్కుల చేతుల్లో చిక్కుకున్నాయి. పార్కు స్థలాలను మాత్రం జీవీఎంసీ ప్రహరీలు నిర్మించి వదిలేసింది. ప్రస్తుతం అవి ఆకతాయిలకు అడ్డగా మారి..ఆహ్లాదానికి చోటు లేకుండా పోయింది.

\- అగనంపూడి



కళా విహీనంగా ఉన్న కొత్తూరులోని పార్కు



సెక్టార్-1లోని కాలనీలో పార్క్ స్థలం



కళావిహీనంగా దిబ్బపాలెం పార్కు

జీవీఎంసీ 85, 88 వార్డుల్లో విస్తరించి ఉన్న అగనంపూడి నిర్వాసిత కాలనీలు సెక్టార్ 1 నుంచి మూడు వరకు 23 గ్రామాలకు పునరావాసం కల్పించారు. సెక్టార్-1లో ఐదు గ్రామాలకు, రెండులో 8 గ్రామాలకు, మూడులో మిగిలిన గ్రామాలకు పునరావాసం కల్పించారు. అయితే ప్రతీ సెక్టార్‌లో సామాజిక భవనాలు, సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మిగిలిపోయాయి. మూడు సెక్టార్లలో నాలుగు చోట్ల పార్కుల కోసం స్థలాలు కేటాయించారు. స్థలాల పరిరక్షణ చర్యలు చేపట్టిన పాలకులు, జీవీఎంసీ మాత్రం కనీసం పిల్లలు ఆడుకోడానికి, కాలనీవాసులు సాయంత్రం వేళల్లో నడకతోపాటు వినోదం కోసం పది నిమిషాలు కూర్చోడానికి కూడా ఎటువంటి బెంచీలు, క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్‌లు నిర్మించలేదు. మొక్కలు పెంచే వీలున్నా కనీసం పట్టించుకోలేదు. పిచ్చిమొక్కలు, తుప్పలు, చెత్తా చెదారాలకు కేంద్రాలుగా మారాయి. ఉక్కు నగరాల్లో 12 సెక్టార్లలో వందల ఎకరాల్లో నాలుగు ఉద్యాన వనాలు, చిన్న చిన్న పార్కులు, బంగ్లాల చుట్టూ గార్డెనింగ్, పచ్చదనం కోసం లక్షలాది మొక్కలు నాటి పెంచారు. అదే నిర్వాసితకాలనీల్లో మాత్రం కనీసం నీడ నిచ్చే చెట్లుగాని, ఆహ్లాదాన్నిచ్చే గార్డెన్లు, స్థానికులు నడవడానికి వీలుగా వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయలేదు. ప్రతీ సెక్టార్‌లో ఐదు నుంచి పదివేల జనాభా వరకు నివాసమంటున్నారు. అలాంటి కాలనీల్లో ఆడుకోడానికి ఆట స్థలాలు లేక, సాయంత్రం వేళ సేదతీరడానికి ఉద్యానవనాలు లేకపోవడం దారుణమని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పార్కులను అభివృద్ధి చేయాలి



నిర్వాసిత కాలనీల్లో మూడు దశాబ్దాల కిందట పార్కుల కోసం స్థలాలు కేటాయించారు. అప్పట్లో ఉద్యానవనాల కోసం కేటాయించిన స్థలాలు అలాగే ఉన్నాయి. కనీసం అభివృద్ధి పనులు చేపట్టకపోగా, మొక్కలు కూడా నాటకపోవడ వల్ల కళావిహీనంగా ముళ్లపొదలతో నిండిపోయాయి. విలువైన స్థలాలను అభివృద్ధిచేస్తే కాలనీవాసులకు సాయంత్రం, ఉదయం వేళల్లో సేదతీరడానికి వీలుండేది.

\- ఎం.మస్తాన్‌రెడ్డి, సెక్టార్-2

నిర్వాసిత కాలనీలంటే అలుసా...



నిర్వాసిత కాలనీలంటే ఉక్కు అధికారులకు మరీ అలుసు అయిపోయింది. ఆది నుంచి కాలనీలను చిన్న చూపు చూస్తూ వస్తున్నారు. మౌలిక వసతులతోపాటు పార్కుల అభివృద్ధి చేయాల్సి ఉన్నా ఉక్కునగరంలోని సెక్టార్లలోని ఉద్యానవనాలకు వెచ్చిస్తున్న నిధుల్లో ఒకశాతం కూడా కేటాయించడం లేదు. కార్మిక సంఘాలు కూడా పట్టించుకపోవడం వల్లే అధికారులు నిర్లక్ష్య ధోరణి కనబర్చారు.జీవీఎంసీ స్వాధీనం చేసుకోవడంతో ఉక్కు కూడా పట్టనట్టు వదిలేసింది. కనీసం జీవీఎంసీ పాలకులు, అధికారులు స్పందించి పార్కులను అభివృద్ధి చేయాలి.

\- బలిరెడ్డి నాగేశ్వరరావు, కొండయ్యవలస

రెండింటికీ చెడ్డ రేవడిలా



అటు ఉక్కు యాజమాన్యం వదిలేసింది. జీవీఎంసీలో విలీనమై రెండు దశాబ్దాలు కావస్తున్నా జీవీఎంసీ పాలకులు కూడా అదే ధోరణితో వ్యవహరించడంతో నిర్వాసితకాలనీల్లో మౌలిక వసతులు, పార్కుల అభివృద్ధి రెండింటికీ చెడ్డ రేవడిలా తయారైంది. సాయంత్రం వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి కొద్దిసేపు కాలక్షేపం, ఆహ్లాదం కోసం పార్కు స్థలాలను అభివృద్ధిచేయాలి. ఓపెన్‌జిమ్, పిల్లల వినోదం కోసం ఆటవస్తువులు, వాకింగ్ ట్రాక్‌లతో పాటు మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దాలి.

\-కొలిపాక అప్పారావు, పెదమడక

రూల్‌ఆఫ్ రిజర్వేషన్ అమలుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లయ్య

ఉక్కునగరం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిశ్రమల కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య నియమితులయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఎనుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పోరాటాల గురించి చర్చించి వివిధ నిర్ణయాలు తీసుకున్నారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడానికి రూరల్ డెవలప్‌మెంట్ కమిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ, ఇండస్ట్రియల్ కోఆర్డినేషన్ కమిటీ, అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్‌గా నియమితులైన మల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కచ్చితంగా అమలు జరిగేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దాకే సువర్ణ రత్నం, ఎస్. సత్యనారాయణ, డి. పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌ఐతో వ్యాపార అవకాశాలు



సదస్సులో ప్రసంగిస్తున్న రమేష్

గాజువాక: ప్రపంచంలోనే అతిపెద్ద వ్యాపార నెట్‌వర్కింగ్ వేదికగా బీఎన్ఐ నిలుస్తోందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.వి.టి.రమేష్ అన్నారు. శీలానగర్‌లో ఆదివారం నిర్వహించిన బిజినెస్ సదస్సులో ఆయన మాట్లాడారు. సంస్థలో సభ్యులుగా ఉన్నవారికి వ్యాపార వృద్ధిలో సూచనలతోపాటు కొత్త పరిచయాలను అందిస్తున్నామన్నారు. వివిధ రంగాల నుంచి వచ్చిన వ్యక్తులకు వ్యాపార అవకాశాలు చూపించే విధంగా తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏపీ మెడ్‌టెక్ జోన్ ప్రతినిధి రోహిత్, ఆటోనగర్ ఐలా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్, మాజీ అధ్యక్షుడు ఎ.కె.బాలాజీ, బీఎస్ఐ ప్రతినిధులు చెరుకు కిరణ్, వంకాయల ఉదయ్, హర్షవర్ధన్, బాల గంగాధర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి కృషి



నక్క వెంకటరమణను శాలువాతో సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి.

పెదగంట్యాడ: వైఎస్సార్‌టీయూసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నక్క వెంకటరమణ ఆదివారం మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో అవకాశాన్ని కల్పించినందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పాటుపడాలని అన్నారు. నక్క వెంకటరమణ మాట్లాడుతూ వైఎస్సార్‌టీయూసీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మార్టుపూడి పరదేశి, కొయ్య భారతి, గొందేశి వెంకటరమణారెడ్డి, అండిబోయిన అప్పారావు, సంపంగి ఈశ్వరరావు, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాయని రాధకు విశాఖ చిత్ర బిరుదు ప్రదానం



గాయని రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరిస్తున్న సుహాసిని ఆనంద్

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సినీ నేపథ్య గాయని చిత్ర జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గాయని, ఉపాధ్యాయురాలు జి.కె.రాధను విశాఖ చిత్ర బిరుదుతో సత్కరించారు. గాయని రాధకు సినీ నేపథ్య గాయని చిత్ర పేరిట బిరుదు ప్రదానం చేయడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ సుహాసిని ఆనంద్ అన్నారు. వివిధ భాషల్లో 25 వేలకు పైగా పాటలు పాడి జాతీయ స్థాయి అవార్డు పొందిన చిత్ర పేరిట బిరుదు అందుకోవడం గొప్పవిషయమని కొనియాడారు. ఘంటసాల స్మారక కళాపీఠం అధ్యక్షుడు గ్రంథి విష్ణుమూర్తి మాట్లాడుతూ సాంస్కృతిక రాజధానిగా ఖ్యాతి గాంచిన విశాఖలో కళలు, కళాకారులను గుర్తించి ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. అనంతరం జరిగిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు జి.కె.రాధ, విశ్వప్రసాద్, కోమలి, దేవరాజ్, సాత్విక, మనోహర్ ,శైలజ, సత్య, అనూష, రమేష్‌కుమార్, మురళీధర్ తదితరులు చిత్ర పాడిన పాటలు ఆలపించి అలరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, సంఘ సేవకుడు తోట ముకుంద్, ఉపకార్ ట్రస్టు మేనేజర్ సుధీర్, ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత అబ్దుల్ కలాం



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ, ఉపాధ్యాయులు

గాజువాక: భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ డాక్టర్ ఎ.పి.జె.అబ్దుల్ స్ఫూర్తి ప్రదాత అని గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. నిస్వార్థంగా దేశానికి సేవలందించడమేకాక దేశ ప్రథమ పౌరుడిగా కూడా ఆయన సాధారణ జీవితాన్ని గడిపి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. కలాం పదో వర్ధంతిని స్థానిక ట్వింకిల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం నిజాయితీ, క్రమశిక్షణతో దేశ ప్రథమ పౌరునిగా ఎదిగారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ డి.శ్యామ్, ప్రిన్సిపాల్ ఎస్.కరుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టేట్ బాక్సింగ్ అసోసియేషన్ కోశాధికారిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

ఉక్కునగరం: రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ కోశాధికారిగా ప్రముఖ బాక్సింగ్ క్రీడాకారుడు, స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం మాజీ అధికారి కడియాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఐ.వి. రావు, కార్యదర్శి పి. మధుసూదనరావు తదితర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్రాంత న్యాయమూర్తి గెడ్డన్న సమక్షంలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నికలకు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఆర్. గోపు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధి కె. సూర్యనారాయణ, జిల్లా స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి రమణ పరిశీలకులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

రహదారులు మూసివేస్తే స్టీల్‌ప్లాంట్‌కు లాభమేంటి?

వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ కృష్ణారావు



వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ కృష్ణారావు

కూర్మన్నపాలెం: ప్రజలను ఇబ్బంది పెట్టడడం వల్ల విశాఖ ఉక్కు కర్మాగారానికి కలిగే ప్రయోజనం ఏమీ ఉండదని వైజాగ్ ప్రొఫైల్స్ కంపెనీ డైరెక్టర్ వి.వి.కృష్ణారావు పేర్కొన్నారు. ఈ విషయాన్ని కర్మాగార యాజమాన్యం గ్రహించి నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని ఆయన సూచించారు. గ్రీన్‌సిటీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నోతరాలుగా పారిశ్రామిక ప్రాంత ప్రజలు వినియోగిస్తున్న రహదారులను మూసివేయడం అనాలోచిత నిర్ణయం అన్నారు. ఒక వ్యక్తితో ఉన్న గొడవను సాకుగా చూపి వేలాది మంది నిత్యం ప్రయాణించే రహదారులను మూసివేయడంలో అర్థంలేదన్నారు. దుర్గానగర్ నుంచి బీసీ రోడ్డులో గడ్డర్ ఏర్పాటు చేసి పెద్ద పెద్ద వాహనాలు వెళ్లకుండా కుట్ర చేసిందన్నారు. దీని వల్ల పలు కంపెనీల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ విధానాలు విడనాడి రహదారిపై ఏర్పాటు చేసిన గడ్డర్‌ను వెటనే తొలగించాని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదని ఆయన హెచ్చరించారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



వికాష్‌నగర్ కూడలి నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెదగంట్యాడ: భగవాన్ బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశయాలకు అనుగుణంగా అహింసా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సేవలు చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. పిరమిడ్ స్పిర్చువల్ ట్రస్ట్ కార్యదర్శి మీసాల శివ గణేశ్వరరావు ఆధ్వర్యంలో శాకాహార సద్భావన ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వికాష్‌నగర్ జంక్షన్ నుంచి ప్రియదర్శిని కాలనీ మీదుగా సాగిన ర్యాలీలో అధిక సంఖ్యలో శాకాహారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, శాకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రేవతీదేవి, సీతామనోహరి, మూర్తి, అప్పారావు, జగదీశ్వరి, బాలాజీ, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టంలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవను ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు.

వీధి దీపాలు వెలగవు!

దువ్వాడ రైల్వే క్రాసింగ్ వంతెనపై అంధకారం



దువ్వాడ రైల్వేస్టేషన్ క్రాసింగ్, వీఎస్ఈజెడ్ వంతెనపై వెలగని వీధి దీపాలు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ దరి ఫ్లైఓవర్‌పై వీధి దీపాలు కొన్ని నెలలుగా వెలగడం లేదు. రాజీవ్‌నగర్ కూడలి నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్, వీఎస్ఈజెడ్‌లకు వెళ్లే మార్గంలో వంతెనపై రెండు వైపులా దీపాలు ఏర్పాటు చేశారు. అయితే ఎప్పుడూ వెలగవు. అటు జీవీఎంసీ, ఇటు రైల్వే, మరోవైపు వీఎస్ఈజెడ్ అధికారులు పట్టించుకోవడం లేదు. రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారం నుంచి అలాగే వీఎస్ఈజెడ్ యూనిట్లలో పనిచేసే కార్మికులు, విద్యార్థులు నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే సబ్బవరం మండలంలోని గ్రామాలకు ఈ మార్గం సమీపం కావడంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రాత్రి వేళ వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకుంటుంది. దీంతో చీకట్లోనే ప్రయాణికులు వెళ్లి వస్తున్నారు. అధికారులు చొరవ తీసుకొని ఈ మార్గంలో వీధిదీపాలు వెలిగించే ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న 'బుద్ధునితో నా ప్రయాణం'



అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట: బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం 'బుద్ధునితో నా ప్రయాణం' తెలుగు నాటకాన్ని ప్రదర్శించారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి, కార్పొరేటర్ గంగారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ అభ్యుదయం అకాడమీకి చెందిన 40 మంది కళాకారులు నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. దుఃఖం, పేదరికం, హింసకు మూలాలు, వాటికి విముక్తి మార్గాలు, బుద్ధుడి సందేశం, జీవిత చరిత్ర, బుద్ధిజం భారతదేశానికి ఎందుకు అవసరం, అంబేడ్కర్ ఆలోచనలను చక్కగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీకి భారత రాజ్యాంగం ఒరిజనల్ ప్రతిని బహూకరించారు. కార్యక్రమంలో బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్, బత్తుల గౌతంబాబు పాల్గొన్నారు.